W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

4-2-2026



# అప్పుడు అరాచకం.. ఇప్పుడు ఆరాటం!



02

“అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు” అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు.



06

## అభ్యర్థుల చేతికి బీ ఫామ్‌లు

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ మంగళవారం బీఫాములు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సిపిఐ బిజెపి ఇతర పార్టీల వారికి సైతం బి ఫామ్ లు ఇచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సిపిఐ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బి ఫామ్ పత్రాలు అందజేయగా, కాంగ్రెస్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఇల్లందులో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు తమ పార్టీ నుండి పోటీ చేస్తున్న వారందరికీ బీ ఫామ్ లు ఇవ్వడం జరిగింది.



03

## యూరియా ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చు

యూరియా ను రైతులు ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చునని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం మొక్కజొన్న, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కత్తెర పురుగులో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి లో అగ్గి తెగులు నివారణ కు రైతులకు పలు సూచనలు చేశారు.




06

బి ఫామ్ పంపిణీతో కొందరికి నిరాశ మరికొందరికి సంతోషం

వేడెక్కిన మున్సిపల్ రాజకీయం

# అభ్యర్థులు ఫైనల్ నిరాశలో ఆశావహులు!

కొత్తగూడెం కార్పొరేషన్ గా ఏర్పడడంతో పాటు సకాలంలో సైతం ఎన్నికలు రావడం వల్ల ఇటు మాజీ కౌన్సిలర్లు అటు కొత్తవారు కూడా పోటీకి సిద్ధమై నామినేషన్లు వేస్తే కొందరికి అనుకున్న వాతావరణం కనిపించకపోవడంతో అసంతృప్తిలో ఉన్నారు. అంతా అనుకున్నట్లే అవుతుందని ఆశ పడ్డవారందరికీ చుక్కెదురయింది. కొత్తగూడెం కార్పోరేషన్కు జరుగుతున్న ఎన్నికల్లో ఆశావాహులకు నిరాశ మిగలిందని చెప్పవచ్చు. ఒక పార్టీలో టిక్కెట్టు రాదని తెలుసుకున్న వారందరూ మరో పార్టీలో చేరారు. టిక్కెటు ఇస్తామని పార్టీ కండువలు కప్పిన అభ్యర్థులకు చివరి నిముషంలో అంతా మారి పోయింది. “అనుకున్నది ఒక్కటి...! అయినది మరొక్కటి...’! అన్న చందంగా మారింది.



భద్రాద్రి బ్యూరో, మహా

# అప్పుడు అరాచకం.. ఇప్పుడు ఆరాటం!

- నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత నాదే
- గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి నిప్పులు
- ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం





**ఏదులాపురం:** "అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు.

## సొంతింటి కలను నెరవేరుస్తాం

ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు.

## సంక్షేమ పథకాలతో పేదల చెంతకు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు.

## ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీచేస్తున్న అభ్యర్థులకు 'బీ-ఫామ్' అందజేత





**ఏదులాపురం,మహా:** ఏదులాపురం మున్సిపాలిటీలో ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కీలక ఘట్టాన్ని పూర్తిచేసింది. ఈరోజు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకు బీ ఫామ్ లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీ ఫామ్ అందుకున్న అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూ వెంటనే వారి నామినేషన్లను ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించడం జరిగింది. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయం. ప్రచారంలో ప్రజల ప్రేమ, ఆదరాభిమానాలు చూస్తుంటే అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే తప్పకుండా విజయం సాధిస్తారన్న నమ్మకం ఏర్పడింది. అభ్యర్థులు వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, అందరినీ కలుపుకొని గెలుపే లక్ష్యంగా గడపగడపకు ప్రచారం నిర్వహించి ప్రభుత్వ ప్రజారంజక పాలన, అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఓటర్ల దీవెనలు పొందాలని దిశానిర్దేశం చేయడం జరిగింది.

## మణుగూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



**మణుగూరు, మహా:** మణుగూరు పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించేందుకు సీఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్ లు మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు.పట్టణంలోని సురక్ష బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మార్గ నిర్దేశం చేసేలా రిఫ్లెక్టివ్‌తో కూడిన ఆరెంజ్ రంగు డెలినేటర్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ పోస్టులను రోడ్డుపై బోల్టులు బిగించి శాశ్వతంగా ఉండే విధంగా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్ సమీపంలో బస్సులు సులభంగా రాకపోకలు సాగించేందుకు, అలాగే ప్రయాణికులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఆటోలను పోలీసులు నిర్దేశించిన మార్గంలోనే వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రాత్రి వేళల్లో డ్రైవర్లకు స్పష్టంగా కనిపించేలా డెలినేటర్ పోస్టులకు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు అమర్చారు. ఈ సందర్భంగా సీఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్ లు మాట్లాడుతూ, సురక్ష బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన డెలినేటర్ పోస్టుల ప్రకారం ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. పోలీసుల మార్గదర్శకాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన ఎంపిడిఓ వెంకటేశ్వరరావు

**పినపాక, మహా:** గ్రామీణ ప్రాంతా ల్లోని క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేం దుకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహి స్తున్నట్లు పినపాక మండల సీఎం కప్ క్రీడల చైర్మన్, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి గా హజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు వారికి సరైన వేదిక కల్పించడమే సీఎం కప్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్రీడలు వలన క్రమశిక్షణ, సమన్వయం వంటి విలువలు అలవడతాయని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది యువత పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎంఈఓ నాగయ్య, సర్పంచ్ లు కొర్సా విజయలక్ష్మి, తోలెం స్వప్న, పడిగ, క్రిష్ణవేణి, సుతారి సింధూజ, మద్దెల సమ్మయ్య, వాగబోయిన చందర్ రావు, పీడి వీరన్న, స్థానిక అధికారులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్దీపకం విద్యార్థుల విద్యాభ్యాసం బలోపేతానికి దోహదపడుతుంది



**బూర్గంపహాడ్ మహా:** ఉద్దీపకం వర్క్ బుక్ విద్యార్థుల విద్యాభ్యాసం బలోపేతా నికి దోహదపడుతుందని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. ఉడ్ యార్డ్ లోని జిపిఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలను ఇతర అంశాలను విద్యార్థుల చేత బోర్డుపై వ్రాయించి దానికి సంబంధించిన తాత్పర్యాలు పిల్లలను అడగగా వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిన్నారుల విద్యాభ్యాసం బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం జరిగిందని, ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలు విద్యార్థులు సరిగా చెప్పకపోవడం ఉపాధ్యాయుల పనితీరు ఎలా ఉందో అర్థమయిపోతుందని, ఈ నెలలో మరల ఈ పాఠశాలను సందర్శిస్తానని ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని ప్రతి పదాలు, గుణకారాలు, భాగాహారాలు, చతుర్వేదికలు అన్ని పిల్లలు చెప్పే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని, లేనియెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులందరినీ పరీక్షలు సక్రమంగా రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

## బి ఫార్మ్‌లు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బి ఫార్మ్‌లను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య మంగళవారం అందజేశారు.సత్తుపల్లిలో గత బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలు గుర్తుంచుకున్నారని, మరోసారి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ జెండా ఎగరేలా కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే ప్రతి వార్డులో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, సత్తుపల్లిని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
4-2-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**జూలూరుపాడు, మహా:** ఫిబ్రవరి 12న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు ఏధులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస హక్కులు కల్పించాలని, పేదలకు పని గ్యారంటీ కల్పిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఏస్ చట్టాన్ని కొనసాగించాలని, పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామని ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో టియుసిఐ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రాయల సిద్దు, కార్మికులు రాధ, స్రవంతి, స్వరూప, రమాదేవి, రజిత, శ్రావణి, సునీత, లక్ష్మి, అరుణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర జీఎస్టి అధికారులు తనీఖీలు...!



**నేలకొండపల్లి, మహా:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో కేంద్ర జీఎస్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. మండల కేంద్రం కు చెందిన ఓ వ్యాపారి దుకాణంలో హైడ్రాబాద్ నుంచి వచ్చిన కేంద్ర ప్రత్యేక జీఎస్టి అధికారులు తనీఖీలు చేపట్టారు. సదరు వ్యాపారి కి నోటీసులు జారీ చేసి... తనీఖీలకు ప్రత్యేక బృందం తనీఖీలు చేపట్టారు. సదరు వ్యాపారి ఐరన్. సిమెంట్ వ్యాపారాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన బిల్లులను తనీఖీ చేశారు. జీఎస్టి చెల్లింపుల ను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా లేదా అని గోడౌన్ వద్ద కు వెళ్లి తనీఖీ చేశారు. జీఎస్టి అధికారులు తనీఖీలు చేస్తున్న విషయం ను తెలుసుకున్న పలువురు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఇది ఇలా ఉండగా...నేలకొండపల్లి లో వ్యాపారుల ఇళ్ల పై ఐటీ, సీటీవో ఇతర సంస్థల దాడులు అంటూ సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో ఒక్కసారిగా పట్టణంలో వ్యాపారులు ఉలిక్కిపడ్డారు.

### సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ బోయిన వేణు

**నెలకొండపల్లి, ఫిబ్రవరి 3 మహా:** మండల కేంద్రంలోని రాయిగూడెం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రాయిగూడెం గ్రామంలో నూతనంగా 10లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్లు నిర్మాణనికి గ్రామ సర్పంచ్ బోయిన వేణు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గ్రామంలో వేగంగా పారిశుధ్య పనులు చేపిస్తున్నామని, అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ కుమార్ సెక్రెటరీ హనుమంతరావు నంబూరీ రామారావు బైరు లక్ష్మీనారాయణ కాలింగి వెంకన్న బోయిన కృష్ణయ్య తీగ రామయ్య బోయిన బ్రహ్మం శీతల వెంకటేశ్వర్లు కాలింగ్ వీరబాబు మేకల మాధవి ఎన్నబోయిన నాగరాజు లక్క నాగరాజు వెన్నబోయిన నాగరాజు యేసు రత్నం వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు



# యూరియా ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చు



**నేలకొండపల్లి, మహా:** యూరియా ను రైతులు ఇంటి వద్ద నుంచే బుక్ చేసుకోవచ్చునని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు యం.సతీష్ సూచించారు. మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం మొక్కజోన్న, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కత్తెర పురుగులో నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి లో అగ్గి తెగులు నివారణ కు రైతులకు పలు సూచనలు చేశారు. పలు దుకాణాల ను తనీఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... కూసుమంచి డివిజన్ లో 80 వేల ఎకరాలలో వరి. 16,800 ఎకరాలలో మొక్కజోన్న పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వరిలో అగ్గి తెగులు, మొక్కజోన్న లో కత్తెర పురుగు పీడిస్తుందని అన్నారు. వాటి నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం యాఫ్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాఫ్ వలన జిల్లాలో ఎక్కడ యూరియా అందుబాటులో ఉన్న తీసుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పకుండా ప్రతీ రైతు ఫార్మర్ రిజిష్టర్ చేయించుకోవాలని అన్నారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న 57 సోసైటీల ద్వారా రైతులకు యూరియా ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు నానో యూరియా, డీఏపీ వలన కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ దండా నరసింహారావు పాల్గొన్నారు.

## గిరిజన గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**బూర్గంపహాడ్ మహా:** మారుమూల గిరిజన గ్రామాల నుండి నిరుపేదలైన గిరిజనులు సిహెచ్ సి ఆసుపత్రికి వస్తూ ఉంటారని వారి పట్ల డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపి అన్ని రకాల టెస్టులు నిర్వహించి తప్పనిసరిగా వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సిహెచ్ సి వైద్య శాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.లేబరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణీ స్త్రీల కాన్పుల గది, అవుట్ పేషెంట్ల గది, అల్ట్రా సౌండ్ స్కానింగ్ గది, మందులు నిలువచేసే గదులను పరిశీలించారు. ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిహెచ్సి పనులను పరిశీలించారు అనంతరం రోగులకు అందుతున్న స్కానింగ్ సేవలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల, స్టోర్ రూమ్ లో ఉన్న మందుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యశాలలో అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి అవుట్ పేషెంట్లను, వార్డులలో వైద్య సేవలు పొందుతున్న పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాలనుండి వివిధ రకాల జబ్బులకు వైద్యం కోసం వస్తుంటారని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా వారి గ్రామాల నుండి అంబులెన్స్ లో తీసుకొని రావాలని, డెలివరీ అయ్యే వరకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉన్నది లేనిది పరిశీలించి, తల్లితోపాటు బిడ్డ కూడా సక్రమంగా వైద్య చికిత్సలు చేయాలని అన్నారు. పీహెచ్సీ పరిధిలో పనిచేసే సిబ్బంది గర్భిణీ స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకొని వారికి నెలసరి చికిత్సలు ఏ విధంగా తీసుకోవాలో అవగాహన కల్పించాలని అన్నారు. వాతావరణం మార్పు వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిహెచ్ సి ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు రోగులకు 24 గంటలు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులను ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందించాలని, వివిధ రకాల టెస్టుల కోసం పేషెంట్లను ఎవరిని ప్రైవేట్ ల్యాబ్ లకు పంపించకూడదని, ఎవరైనా పేషెంట్లు ప్రైవేట్ ల్యాబ్ లలో టెస్టింగులు నిర్వహించినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఎం హెచ్ ఓ సైదులు, పర్యవేక్షకుడు ముక్కంటి ఈశ్వరరావు, డాక్టర్లు అనిత, నిషార్ సిహెచ్సి ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ, గ్రామీణ ఉపాధి యూనిట్లను పరిశీలించిన కలెక్టర్





**దమ్మపేట ,మహా:** మండల పరిదిలోని నాగుపల్లి ,లింగాలపల్లి పంచాయతీ లలో మంగళవారం జిల్లా కలక్టర్ జితేష్ వి పాటిల్ ,పశుసంవర్థక శాఖ ఏడి అమయ్ కుమార్ పర్యటించారు. సేంద్రియ వ్యవసాయ సాగు పద్దతులను గురించి రైతుల తో ముచ్చటించారు. ముందుగా జిల్లాలో అమలవుతున్న సేంద్రియ వ్యవసాయం, కౌజు పిట్టల పెంపకం, కొర్రమీను చేపల సాగు వంటి వినూత్న వ్యవసాయ మరియు గ్రామీణ ఉపాధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ అమయ్ కుమార్ పరిశీలించారు.పర్యటనలో భాగంగా పాల్వంచ మండలం కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చరిత సేంద్రియ కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను వారు సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. యూనిట్‌లో అమలవుతున్న సేంద్రియ విధానాలు, కౌజు పిట్టల పెంపకం విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఉత్పత్తి, ప్యాకేజింగ్, మార్కెటింగ్ విధానాలను సమీక్షించి తగిన సూచనలు రైతులకు అందించారు. ఈ సందర్భంగా కలక్టర్ పలు అంశాలను వివరిస్తూ....యూనిట్‌లో సేంద్రియ పద్ధతిలో తయారుచేసే ఉత్పత్తుల్లో మునగాకు ఆధారిత ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు, ఇప్ప లడ్డు, ఇప్ప నూనె, లెమన్ టీ, వివిధ రకాల కారం పొడులు, పచ్చళ్ళు, హెర్బల్ సబ్బులు మొదలైన మొత్తం 102 రకాల ఉత్పత్తులు ఉన్నాయని , గ్రామీణ వనరులను సమర్థవంతంగా ఉపయోగిస్తూ, సోలార్ సిస్టమ్ ద్వారా ఉత్పత్తులను ఎండబెట్టి, రసాయన రహిత విధానంలో ప్రజలకు అందించడం ఈ యూనిట్ ప్రత్యేకత అన్నారు. పరిశుభ్రత, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, సమర్థవంతమైన మార్కెటింగ్ విధానాల వల్ల కౌజు పిట్టల గుడ్లు మరియు మాంసం స్థానిక మార్కెట్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయని తెలిపారు.పక్షులకు అందించే ఆహార దాణా, గాలి ప్రసరణ, షెడ్ నిర్వహణ, పరిశుభ్రత చర్యలను కూడా పరిశీలించి సూచనలు అందించారు. అనంతరం, దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో మహిళా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించారు. గుడ్ల ఉత్పత్తి, గుడ్లను పొదిగించడం, పిల్లల పెంపకం వంటి ప్రక్రియలను యూనిట్ నిర్వాహకులు వివరించారు. జిల్లా కలెక్టర్, రాబోయే రోజుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, యంత్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి చీూదీూ=ణ ద్వారా ఆర్థిక సహాయం పొందేలా సూచించారు. తదుపరి, లింగాలపల్లి గ్రామంలో గిరిజన యువ రైతు చాపా బాలకృష్ణ ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలకృష్ణ, రసాయన ఎరువులు లేదా క్రిమి సంహారక మందులు వినియోగించకుండా, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి సహజ పద్ధతుల ద్వారా మంచి దిగుబడి సాధిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గుర్తించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, గ్రామ సమాఖ్య సభ్యులు, స్థానిక సర్పంచులు, మహిళలు, రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 12 న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



**మణుగూరు, మహా :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు టియుసిఐ నేత ఆర్ మధుసూదన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ నేత వెలగపల్లి జాన్, ఏఐటీయూసీ నేత గడ్డం వెంకటేశ్వర్లు, సీఐటీయూ నేత గద్దల శ్రీనివాస్ లు మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కంకణం కట్టుకుందని విమర్శించారు. ముందుతరాల కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. దేశ ప్రజల, కార్మికుల సంక్షేమం కంటే కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత ఐదేళు ్లగా జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల కారణంగా అమలు చేయలేకపోయిన ఈ కోడ్‌లను 2025 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి, 2026 ఏప్రిల్ నుంచి అమలు చేయడానికి సిద్ధమవుతోందన్నారు. ఈ లేబర్ కోడ్‌లు అమలైతే కార్మిక హక్కులు కాలరాయబడతాయని, కార్మిక వర్గం కార్పొరేట్ శక్తులకు కట్టు బానిసలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వీటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్మిక వర్గంపైనే ఉందన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**భద్రాచలం మహా:** క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గైనకాలజీ సొసైటీ అధ్యక్షురాలు డా. జయభారతి ఎం డి (ఓ బి జి) మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. బుధవారం ప్రపంచ క్యాన్సర్ డే ని పురస్కరించుకొని ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతదేశంలో గర్భాశయం ముఖ ద్వారక్యాన్సర్ ( క్యాన్సర్ సర్విక్స్) చాలా ఎక్కువగా ఉన్నదని, దీనికి ప్రధాన కారణం హ్యూమన్ పాపిలోమా వైరస్ 99.7 శాతం సర్వికల్ క్యాన్సర్ హెచ్పివి వల్లే కలుగుతుందని, పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని తెలిపారు. వివాహేతర సంబంధాలు ఉన్న వ్యక్తుల్లో తీవ్రమైన హెచ్ ఐ వి వ్యాధి ప్రబలుతుందని, ఒక రాముడికి ఒకే సీత, ఒక సీతకు ఒకే రాముడు అన్నది పాటించాలని, 35 సంవత్సరాలు పై పడ్డ స్త్రీలందరూ హెచ్ పివి,డిఎన్ఏ టెస్టులు చేయించుకోవాలని, 9 నుంచి 14 సంవత్సరాలు మధ్య గల వయస్సున్న పిల్లలకు ఆరేళ్ల వ్యవధిలో రెండు డోసుల టీకా మందు ఇవ్వాలని, ఇది అమ్మాయిలకు, అబ్బాయిలకు కూడా ఇవ్వాలని, రెండు డోసులు తీసుకున్న వారికి కచ్చితంగా క్యాన్సర్ సర్విక్స్ రాదని హెచ్ డబ్ల్యు ఓ ( వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) ప్రమాణాలు తెలుపుతున్నాయని వెల్లడించారు. కాబట్టి నేడే మీ పిల్లలకు హెచ్పివి వ్యాక్సిన్ ఇవ్వాలని, మీ ఇంట్లో ఆడవారికి హెచ్పివి డిఎన్ఏ టెస్ట్ చేయించాలని సూచించారు. ఆరోగ్యమైన జీవితం కోసం రెండు టీకాలు అనే నినాదాన్ని తెలియజేశారు.

# మహాత్ముని పేరు మార్చే కుట్రలు మానుకోవాలి:సీపీఎం



**చర్ల ,మహా:** మండల కేంద్రం పూసుకుప్ప గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రాంతాన్ని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు సందర్శించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో సిపిఎం పార్టీ ఎంపీల మద్దతుతో అటవీ హక్కుల చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (100 రోజుల పని) నిరుపేద అణగారిన వర్గాల ప్రజలకు వంద రోజుల పని చట్టాన్ని ఆనాడు తీసుకురావడం జరిగిందని గుర్తు చేశారు .2004 నుండి 2025 వరకు నిరుపేద ప్రజలు అట్టడుగు వర్గాల ప్రజలకు ఆసరాగా ఉండి వాళ్ల జీవనోపాధికి ఉపయోగపడిందని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వికసిప్ భారత్ రాంజీ అనే పథకాన్ని తీసుకురావడం జరిగింది . ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చినటువంటి మహాత్ముడి పేరును ,మహాత్మా గాంధీ పేరును తొలగించే కుట్ర చేసి (వి బి జి రామ్) పథకాన్ని తీసుకురావడం జరిగింది కానీ ఈ పథకంలో ఎటువంటి గ్యారంటీలు లేవుఅని అన్నారు. ఆనాడు కేంద్రం 90 శాతం నిధులు రాష్ట్రాలకు ఇస్తే 10% రాష్ట్ర ప్రభుత్వాలు భరించి పనిని కల్పించేవి మహాత్మా గాంధీ పేరుతో ఉన్నటువంటి ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి విబిజి రాంజీ చట్టాన్ని పెట్టడం వలన 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి 40% రాష్ట్ర ప్రభుత్వాలను ఇవ్వాలని ప్రకటించింది. దీనివలన గ్రామాల నుంచి పేదలు పట్టణాలకు వలసలు పోయే పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు కారు చౌకగా కార్మికులు దొరకాలంటే గ్రామాల్లో పనీదొరక్కుండా ఉంటే కుట్ర ఇది తక్షణమే రాంజీ చట్టాన్ని తొలగించి యధావిధిగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని కొనసాగించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు డిమాండ్ చేశారు. లేనియెడల దశల వారి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్నబి పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోపరేటివ్ బ్యాంకు మేనేజర్ రూపవతిని సత్కరిస్తున్న రైతులు



**దమ్మపేట ,మహా:** కోపరేటివ్ బ్యాంకు ,దమ్మపేట బ్రాంచి మేనేజర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన రూపవతిని మంగళవారం రైతులు ఘనంగా సత్కరించారు. మాజీ వైస్ ఎంపిపి దారా మల్లిఖార్జునరావు , కోపరేటివ్ మాజీ డైరెక్టర్ ,మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు చిన్నశెట్టి సత్యనారాయణ శాలువాతో సత్కరించి ,మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతాంగానికి కోపరేటివ్ బ్యాంకు ఎన్నో విధాలుగా ఉపయోగం లో ఉందన్నారు. ఇప్పటి వరకూ చేసిన మేనేజర్ లు తమ సహాయ సహకారాలు ,అర్హులైన వారికి ఋణ సదుపాయాలు సమకూర్చారని వారి సేవలను కొనియాడారు. అదేవిధంగా నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన రూపావతి కూడా ఈ ప్రాంతంలోని రైతుల మన్ననలు పొందాలని ,ఇక్కడి నుంచే మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో చిన్నశెట్టి సత్యనారాయణ ,దారా పాపారావు , గోపవరపు వంశీ ,సీనియర్ క్యాషియర్ తిమ్మరాజు గణేష్ తదితరులు ఉన్నారు.

## బూర్గంపాడు మండల కేంద్రంలోని బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన బూర్గంపాడు సర్పంచ్



**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ గ్రామపరిధిలోని బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను బూర్గంపహాడ్ సర్పంచ్ సందర్శించి.... భోజనం, వసతి సదుపాయాలు,విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల చుట్టూ ఎటువంటి చెత్త లేకుండా వంటశాలను శుభ్రంగా ఉంచుకుని విద్యార్థులకు మంచి భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్శన లో గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ మందా నాగరాజు ఉప సర్పంచ్ గుండె వెంకన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, గుద్దేటి ప్రవీణ్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా వైద్య దినోత్సవం



**మణుగూరు, మహా :** ఫిబ్రవరి 3 అంతర్జాతీయ మహిళా వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏరియా టిబిజికెఎస్ నాయకులు స్థానిక సింగరేణి వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తున్న మహిళా డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులకు పూల మొక్కలు, మిఠాయిలు అందించి, శాలువాలతో సన్మానించారు. మహిళా డాక్టర్లు సమాజానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, సింగరేణి సంస్థ ప్రగతిలో కీలక భాగస్వాములైన కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరం అందిస్తున్న వైద్య సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. అమెరికాలో తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జ్ఞాపకార్థంగా ఆమె జన్మదినమైన ఫిబ్రవరి 3న అంతర్జాతీయ మహిళా వైద్య దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి మహిళా వైద్యుల సేవలను గుర్తించి సన్మానించడం భవిష్యత్ తరాలకు ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్, దిశెట్టి రమేష్, పీకే నాగరాజు, ఇజ్రాయిల్, మస్తాన్, సాంబార్ రాజా శేఖర్, మహేందర్, అశోక్, మోద్దుల ప్రవీణ్, దారావత్ కృష్ణ, ఫిట్ సెక్రటరీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లోస్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి బంగ్లోస్ ప్రాంతంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగ్లోస్ నందు గత 25 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు అరకొర మస్టర్లతో చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి నెలకు కనీసం 26 మాస్టర్లు వచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని కొత్త వారిని తీసుకోవద్దని డిమాండ్ చేశారు. కార్మికులకు మెరుగైన వైద్యం సరైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రతినెలా ఏడో తారీఖున జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తగూడెం కార్పొరేట్ సెక్రెటరీ ఎడ్ల రాకేష్ , సామంతల విజయ్, నాగరాజు, వెంకటేష్, సరోజ, రోజా, కోటేశ్వరి, దేవి, శిరీష, మంజుల, అస్లీ, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మీ కుమారి





**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పడమట నర్సాపురం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి ఏపీఓ రామారావు, గ్రామ కార్యదర్శి బి హారిక తో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఓ రామారావు ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వ కొలతల ప్రకారం ప్రతి ఇద్దరూ నాలుగు మీటర్లు పొడవు, నాలుగు మీటర్లు వెడల్పు పనిచేస్తే ఒక్కొక్కరికి 307 రూపాయలు వేతనం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. లేదా రోజుకు 8 గంటలు పనిచేయడం ద్వారా పై వేతనం పొందవచ్చునని అన్నారు. అదేవిధంగా ప్రతిరోజు పని ప్రారంభంలో, పని ముగిసే సమయంలో అందరి హాజరు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం నర్సాపురం పంచాయతీలో ఏడు గ్రూపులు, మూడు ప్రాంతాలలో మొత్తం 92 మంది పనిచేస్తున్నారని అన్నారు. గ్రూపుల హాజరు నమోదుకు నూతన మేట్ లను నియమించనున్నట్లు తెలిపారు. పనికి కావలసిన పలుగు, పార లు గ్రామాలకు సరఫరా చేయడం జరిగిందని, త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామని అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ జాబ్ కార్డ్ కలిగివున్న ప్రతి ఒక్కరూ పనిలో పాల్గొని ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఈసీ సైదులు, టిఏ నాగమణి, ఎఫ్ఏ రవి, సంఘం చిన్న రాజు తోపాటు, ఉపాధి హామీ కూలీలు, పాల్గొన్నారు.



## యుఆర్ఎస్ విద్యార్థులకు రాత సామాగ్రి పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంపిక చేసిన అవసరత ఉన్న విద్యార్థులకు రాత సామాగ్రి పలకలు, బలపాలు, పెన్నులు, పెన్సిళ్లను మంగళవారం కొత్తగూడెం మాజీ మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాత నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. చదివే బ్రతుకులను మార్చుతుందని పేర్కొన్నారు. విద్యార్థి విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. చదివే అన్నింటిలో గొప్ప సంపదంటూ వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అసెంబ్లీ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:** కొత్తగూడెం నియోజకవర్గం స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మంగళవారం స్థానిక ప్రకాశం స్టేడియం నందు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, డి వై ఎస్ ఓ పరంధామ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో సైతం రాణించాలని పిలుపునిచ్చారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అసెంబ్లీ స్థాయిలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి (డిస్ట్రిక్ట్ లెవల్) క్రీడా పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి ఎంఈఓ కృష్ణయ్య, చుంచుపల్లి ఎంఈఓ బాలాజీ, సుజాతనగర్ ఎంఈఓ లీల, కొత్తగూడెం ఎంఈఓ మధురవాణి, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ శ్రీ నరేష్, డివైఎస్ఓ ఆఫీస్ సిబ్బంది పులి లక్ష్మయ్య,వివిధ క్లస్టర్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.



# ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ములకలపల్లి, అశ్వరావుపేట మండలాల్లోని పలు జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రయోగ పరీక్షల నిర్వహణ విధానం, ప్రయోగశాలల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు నమోదు, ప్రశ్నపత్రాల భద్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అశ్వరావుపేట మండలంలోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలను కూడా తనిఖీ చేసి పరీక్షలు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు.రెండవ రోజు నిర్వహించిన ప్రయోగ పరీక్షల హాజరు వివరాలను సమీక్షించిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 1,295 మందిలో 1,263 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,386 మందిలో 1,207 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం పరీక్షలకు 2,681 మందికి గాను 2,470 మంది హాజరై 211 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలలో సాధారణ విభాగానికి కేటాయించిన 880 మందిలో 861 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వృత్తి విద్య విభాగానికి కేటాయించిన 1,365 మందిలో 1,308 మంది హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మొత్తం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,245 మందికి గాను 2,169 మంది హాజరై 77 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రయోగ పరీక్షలు పూర్తయ్యే వరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని కళాశాల యాజమాన్యాలను ఆయన ఆదేశించారు.

# అభ్యర్థుల చేతికి బీ ఫామ్‌లు





**భద్రాద్రి బ్యూరో, మహా:** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ మంగళవారం బీఫాములు పంపిణీ చేశారు. కాంగ్రెస్ సిపిఐ బిజెపి ఇతర పార్టీల వారికి సైతం బి ఫామ్ లు ఇచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సిపిఐ అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బి ఫామ్ పత్రాలు అందజేయగా, కాంగ్రెస్ అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ఇల్లందులో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు తమ పార్టీ నుండి పోటీ చేస్తున్న వారందరికీ బీ ఫామ్ లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున పలువురు మాట్లాడుతూ ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులందరూ అఖండ మెజారిటీతో గెలవాలని పిలుపునిచ్చారు.

# అభ్యర్థులు ఫైనల్ నిరాశలో ఆశావహులు

### బి ఫామ్ దక్కినవారిలో సంతోషం

### ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేడెక్కిన మున్సిపల్ రాజకీయాలు

**భద్రాద్రి బ్యూరో, మహా :** కొత్తగూడెం కార్పొరేషన్ తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలు కీలక దశకు చేరాయి. మునిసిపల్ నామినేషన్ల ఉపసంహరణల ఘట్టం ముగియగా, అభ్యర్థులు ఫైనల్ అయ్యారు. దీంతో వచ్చిన వారిలో సంతోషం, రాని వారిలో నైరాశ్యం కనిపించింది. కొత్తగూడెం, సత్తుపల్లి, కల్లూరు, ఇల్లందు, వైరా, అశ్వారావుపేట, మధిర మునిసిపాలిటీలలో రాజకీయం రసవత్తరంగా మారింది. నిన్నటిదాకా బిఫాం ఫైట్ చేసిన అభ్యర్థులు ఇపుడు గెలుపు కోసం గల్లీబాట పట్టారు. కొత్తగూడెం కార్పొరేషన్ గా ఏర్పడడంతో పాటు సకాలంలో సైతం ఎన్నికలు రావడం వల్ల ఇటు మాజీ కౌన్సిలర్లు అటు కొత్తవారు కూడా పోటీకి సిద్ధమై నామినేషన్లు వేస్తే కొందరికి అనుకున్న వాతావరణం కనిపించకపోవడంతో అసంతృప్తిలో ఉన్నారు. అంతా అనుకున్నట్లే అవుతుందని ఆశ పడ్డవారందరికీ చుక్కెదురయింది. కొత్తగూడెం కార్పోరేషన్కు జరుగుతున్న ఎన్నికల్లో ఆశావాహులకు నిరాశ మిగలిందని చెప్పవచ్చు. ఒక పార్టీలో టిక్కెట్టు రాదని తెలుసుకున్న వారందరూ మరో పార్టీలో చేరారు. టిక్కెటు ఇస్తామని పార్టీ కండువలు కప్పిన అభ్యర్థులకు చివరి నిముషంలో అంతా మారిపోయింది. "అనుకున్నది ఒక్కటి...! అయినది మరొక్కటి...'! అన్న చందంగా మారింది. ముఖ్యంగా ఇంత కాలం ఆయా పార్టీలో ఉన్న వారందరికి ఇదే పరిస్థితి కనిపించింది. చివరి నిముషంలో బీ–ఫామ్ ఇస్తామని చెప్పినప్పటికి అధిష్టానం నిర్ణయించిందని, సర్వే ఆధారంగా మీకు టిక్కెట్టు దక్కలేదని స్థానిక నాయకులు బొంకుతున్నారు. దీంతో ఇంత కాలం పార్టీని నమ్ముకున్న వారికి చేదు అనుభవం ఎదురైరెందని చెప్పక తప్పదు. నిన్నటి వరకు తెరమీదన ఉన్న వారిని కాదని మరోకరిని బరిలోకి తీసుకు వచ్చారు. కాంగ్రెస్లో టిక్కెట్ రాలేదని, బీఆర్ఎస్లోకి వెళ్లిన వారికి ఇదే పరిస్థితి, బీఆర్ఎస్లో భీ–ఫామ్ రాదని కాంగ్రెస్లోకి వచ్చినవారికి భంగపాటు తప్పలేదు. చివరికి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. దీంతో ఆయా పార్టీలలో టిక్కెట్ల కోసం రగడ మొదలైంది. ఏకంగా నామినేషన్ల ఉప సంహరణ కేంద్రాల వద్దే పార్టీ నాయకులతో వాగ్వివాదాలకు దిగిన సంఘటనలు, తమకు టిక్కెట్లు కేటాయించకపోవడంతో లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు కనిపించాయి. కొన్ని డివిజన్లలో సీనియర్లను కాదని, జూనియర్లకు బీ–ఫామ్ దక్కిన దాఖాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా సోమవారం అర్ధరాత్రి విడుదల చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితాలు, మంగళవారం నాటి ఉదయానికి మారిపోయాయి. దీంతో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టిక్కెట్లు కేటాయిస్తున్నారంటూ ఆయా పార్టీ కార్యాలయాల ముందు ఆందోళన చేసిన సంఘటనలు కనిపించాయి. మొత్తంగా కార్పోరేషన్ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆశావాహులు పెద్ద ఎత్తున పోటీకి ముందుకు రావడంతో పార్టీ నాయకులకు తల పట్టుకున్నంత పని అయింది. బుజ్జగింపులు చేసి కొంత మందిని పోటీల నుండి ఉపసంహిరించేలా చేసినప్పటికీ ప్రధాన పార్టీల అభ్యర్థులకు కొన్ని వార్డుల్లో రెబల్స్ ఉన్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఈసారి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమరం రసవత్తరంగా ఉంటుందని జిల్లా కేంద్రంలోని ప్రధాన సెంటర్లలో పలువురు చర్చించుకోవడం గమనార్హం.

# రేగాను రాజకీయ సమాధి చేయాలని చూసింది కాంగ్రెస్ పార్టీ కాదా



**పినపాక, మహా:** 2014 ఎన్నికల్లో పొత్తులో భాగంగా కావాలని రేగా కాంతారావు సిట్టింగ్ సీటును తీసేసి సీపీఐ కి కేటాయించి రేగా కాంతారావు కి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్ అంటారా? అని బీ ఆర్ ఎస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కాయం శేఖర్ కాంగ్రెస్ నాయకులను దుయ్య పట్టారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు .2009 నుంచి 2018 వరకు కాంగ్రెస్ పార్టీని జిల్లాలో నిలబెట్టింది ఎవరు? రేగా కాంతారావు అనే విషయం మీకు తెలియదా? భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఆదివాసి బిడ్డ రేగా కాంతారావుకు ఇచ్చిన గంటలోనే తీసేయడం ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించాడు. కాంగ్రెస్ పార్టీ లోనే కొంతమంది ముఖ్య నాయకులు ఏకమై రేఖ కాంతారావు రాజకీయ జీవితాన్ని సమాధి చేయాలని చూసింది వాస్తవం కాదా అన్నారు. అయినా సరే, కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో తన స్టిట్టింగ్ సీటును త్యాగం చేసి కాంగ్రెస్‌ను బ్రతికించిన నాయకుడు రేగా కాంతారావు అన్నారు.ఆదివాసి నాయకుడు ఎదగకూడదు" అనే భావనతోనే ఆయనను అణిచివేసింది మీ అగ్ర నాయకత్వం కాదా? ఈరోజు నీతులు చెబుతున్నారు.. మీ నాయకుడు ఎన్ని పార్టీలు మారాడో మీకుతెలియదా? ఒకసారి పార్టీ మారితే వంద ప్రశ్నలు అడుగుతున్న మీరు, అభివృద్ధి కోసం పార్టీ మారడం తప్పా? ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోండి అని రేగాను విమర్శించడమే పని పెట్టుకున్న వారికి సూచన చేశారు. రాబోయే రోజులలో ప్రజలు ఎవరికి కారు కాల్చి వాత పెడతారో తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.